క్లుప్తంగా

సజ్జలతో యెనుముల ఆత్మీయ భేటి



గురజాల: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవి అప్పగించడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డిని దుశ్శాలువాలతో సత్కరించారు.

గోశాల కోసం స్థల పరిశీలన



దాచేపల్లి: గోశాల కోసం స్థలాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ సోమవారం పరిశీలించారు. దాచేపల్లికి చెందిన పసుపులేటి పిచ్చయ్య గోశాల కోసం దాచేపల్లిలోని సర్వేనెంబర్ 807/16 లో స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. దీంతో తహసీల్దార్ ఆ స్థలాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. పక్కనే ఉన్న గోశాలను కూడా ఆయన చూశారు. గోశాల నిర్మాణం కోసం స్థలం కేటాయించేలా తన వంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వీఆర్‌ఓ కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు



దాచేపల్లి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ పినాకపాణి చెప్పారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా కానిస్టేబుళ్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పినకాపాణి మాట్లాడుతూ... ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం ఈనెల 31 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదవాలని ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 10వ తరగతికి 14, ఇంటర్మీడియెట్‌కు 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ టీజే చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

ఎంఈఓ- 1గా జ్యోతి బాధ్యతల స్వీకరణ

మాచర్ల రూరల్: మండల విద్యాశాఖాధికారి-1 గా నియమితులైన దేవనబోయిన జ్యోతి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె విజయపురిసౌత్ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఎంఈఓ- 1 ఇన్‌చార్జి బాధ్యతల్లో చేరారు. ఆమెను ఎంఈఓ- 2 అల్లి సురేష్ అభినందించారు. ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, శ్రీనివాసరావు, ఆదర్స్ పబ్లిక్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కోలా ఝాన్సీతో పాటు ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రైనీ ఎస్‌ఐగా పవన్‌కుమార్



పిడుగురాళ్ల: పట్టణ పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్ఐగా కీర్తిపాటి పవన్‌కుమార్ సోమవారం విధుల్లో చేరారు. సీఐ శ్రీరాం వెంకట్రావును కలసి బాధ్యతలు చేపట్టారు. పవన్‌కుమార్ శిక్షణ ముగించుకొని ప్రాక్టికల్ ట్రైనీ కోసం పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

ఆట్యా-పాట్యా జిల్లా జట్టుకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

నకరికల్లు: క్రీడలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని దేచవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ సోమవారం తెలిపారు. ఆట్యా-పాట్యా జిల్లా జట్టులో తమ పాఠశాల విద్యార్థులు కె.బుజ్జి, మేఘన, యిస్మాయిల్‌లు స్థానం సాధించారని అన్నారు. ఆగస్ట్ 8, 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో క్రీడా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాసు బ్రహ్మానందరెడ్డి సేవలు చిరస్మరణీయం

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మాదాల కిరణ్‌కుమార్



కాసు బ్రహ్మానందరెడ్డి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతానికి సాగునీటిని అందించిన ఘనత ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత కాసు బ్రహ్మానందరెడ్డికే దక్కుతొందని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి కొనియాడారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత ఆయన నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్నో అత్యున్నత పదవులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చల్లా పిచ్చిరెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు సయ్యద్ జబీర్, యూత్ ప్రెసిడెంట్ మందా సుధీర్, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు బచ్చే మేస్త్రీ, కౌన్సిలరు కత్తెరపు వాసుదేవరెడ్డి, గుర్రం అప్పిరెడ్డి, షేక్ అబ్దుల్లా, కాంద్రగుంట శ్రీనివాసరావు, జడ సురేంద్ర, చింతల జానికిరామయ్య, జానిబాబు, కొండలు, షేక్ సైదావలి పాల్గొన్నారు.

డ్రైయినేజీ కాలువను నిర్మించండి

దాచేపల్లి: రైల్వే స్టేషన్ రోడ్డులో తప్పనిసరిగా డ్రైయినేజ్ నిర్మాణం చేపట్టాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ కొమెర బత్తిని విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ ఏఈ సుబ్బారావుకు నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లాలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైల్వే స్టేషన్ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మాణాలు చేపట్టి కొంతమేర పనులు కూడా కొనసాగినట్లు చెప్పారు. తాజాగా ఈ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారని, డ్రైయినేజీలు నిర్మించకుండా కేవలం రోడ్డు మాత్రమే నిర్మిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.దీని వలన ఇళ్లల్లోకి మురుగు చేరే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మాలలు ఐకమత్యంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్ లక్ష్మయ్య

విజయపురిసౌత్: మలాలంతా ఐకమత్యంతో ఉండి ముందుకు సాగాలని మాల మహానాడు చీఫ్ అడ్వైజర్, కాంట్రాక్టర్ లక్ష్మయ్య అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లో మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మాల మహానాడు విజయపురిసౌత్ అధ్యక్షుడిగా బొబ్బిలి చంద్ర శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పురాణం శ్రీనివాస్ రావు, కార్యదర్శిగా పిల్లి రాజబాబు, జాయింట్ సెక్రటరీగా పత్తి రామచంద్ర రావు, ఆర్గనైజ్ సెక్రటరీగా కట్టా రాజు, జనరల్ సెక్రటరీగా చింతమల్ల శ్రీనివాస్, కోశాధికారిగా కొదమగుళ్ల వెంకట్ నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, కాంట్రాక్టర్ లక్ష్మయ్య నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మల్లికార్జున, గంగాధర్, నాగేండ్ల శ్రీను, జి.కోటేశ్వరరావు, గుంటి ఆంద్రుస్ బాబు, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభయ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో చోరీ



దొంగలు పగలగొట్టిన హుండీ

పిడుగురాళ్ల: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కనే ఉన్న శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ సభ్యుడు ఆలేటి మల్లికార్జునరావు తెలిపిన వివరాలు... గుర్తు తెలియని వ్యక్తులు అభయాంజనేయ స్వామి దేవాలయంలో ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు ఫీజులను కట్‌చేసి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అనంతరం దేవాలయంలోకి చొరబడి భక్తులు కానుకలు వేసే మూడు హుండీలను పగలగొట్టి అందులో ఉన్న కానుకల నగలను అపహరించినట్లు తెలిపారు. సుమారు రూ.20 వేల ఉండవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై పట్టణ సీఐకు వాట్సప్ ద్వారా సమాచారం అందించటం జరిగిందన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఏవో

సత్తెనపల్లి: పంటలు సాగు చేసే రైతులు బీమా చేయించుకోవాలని మండలం వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని గుడిపూడి గ్రామంలో పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనపై సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ) ద్వారా వాతావరణంలో వచ్చే మార్పులతో పంట నష్టం వాటిల్లితే రైతులను ఆదుకొనుటకు పునర్వ్యవస్థీకరింపబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ఖరీఫ్-2025 నుంచి అమలు చేస్తుందన్నారు. మండలంలో పత్తి పంటను సాగు చేసే రైతులు ఎకరాకు రూ.1,900 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. పంట నష్టం కలిగినట్లయితే బీమా మొత్తం రూ.38 వేలు పొందవచ్చన్నారు. వ్యవసాయ రుణం పొందిన రైతులు బ్యాంకు శాఖా ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునని, వ్యవసాయ రుణం పొందని రైతులు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవా, రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి బీమా చేసుకోవాలన్నారు. బీమా ప్రీమియం చెల్లింపుకు 31 వరకు గడువు ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా పప్పు ధాన్యాలు, ఎండు మిరప పంటలకు 31వ తేదీ లోపు, వరి సాగు చేసే రైతులు ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. పప్పుధాన్యాలకు ప్రీమియం ఎకరాకు రూ.40 చెల్లించి బీమా మొత్తం రూ.20 వేలు, ఎండు మిరపకు రూ.360 చెల్లించి బీమా మొత్తం రూ.90 వేలు పొందవచ్చన్నారు. వరికి ఎకరాకు రూ.80 చెల్లించి బీమా మొత్తం రూ.40 వేలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు ఏ సుబ్బారావు, నింగయ్య, ఏఈవో జానీ బాషా, వీహెచ్ఏ శాంతి శ్రీ, రైతులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా వీరాంజనేయులు



పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ ప్రెసిడెంట్‌గా బండ్లమూడి వీరాంజనేయులు ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి ఎన్నికైన లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ నూతన కార్యవర్గం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ క్లబ్ టౌన్ ప్రెసిడెంట్‌గా బండ్లమూడి వీరాంజనేయులు, సెక్రటరీగా ముద్దా రమేష్‌బాబు, ట్రెజరర్‌గా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా పెద్దింటి వెంకటేశ్వర్లు, గుర్రం మహేశ్వరరావు, కె.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా తోట పద్మ, డైరెక్టర్లుగా ఎం.వెంకటేశ్వరరావు, కర్నాటి వెంకటరెడ్డి, పాతూరి రామకోటయ్య, తవిటి భావన్నారాయణ, వైపీ మురళీకృష్ణ, డి.శ్రీనివాసరావు, కె.విష్ణు, కొండవీటి రాజులచే సీనియర్ లయన్ కంబాల వెంకటేశ్వరరావు ఇండక్షన్ ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్ కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో-1 ఏ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ లయన్స్ సేవలు అభినందనీయమని కొనియాడారు. నూతన కార్యవర్గం సేవా కార్యక్రమాల్లో భాగంగా షేక్ మస్తాన్‌వలి ఆర్థిక సహాయంతో పేదవారికి కుట్టు మిషన్, పేద మహిళలకు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవహార కర్తలుగా వైపీ మురళీకృష్ణ, మంచికంటి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ముందుగా స్వర్గీయ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 316 హెచ్ జిల్లా కేబినెట్‌లో 2025-26 సంవత్సరానికి పదవులు పొందిన లయన్ కంబాల వెంకటేశ్వరరావు, కోట వెంకటేశ్వర్లు, కంకణాల విష్ణువర్ధన్‌రావు, తోట చిన్నసాంబ శివయ్య, పాతూరి రామకోటయ్యలను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిదవ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్సు కలిగి ఏడాది గడిచి ఉండాలన్నారు. సంస్థ నిబంధన ప్రకారం డ్రైవింగ్ చేసిన యెడల వారికి ప్రతి దినము రూ.800లు జీతం ఇవ్వబడుతుందన్నారు. అర్హతలు ఉన్నవారు 9959225428 ఫోన్ నంబరుకు ఫోను చేసి వివరాలు తెలుసుకుని హాజరు కావాలని కోరారు.

జగనన్న కాలనీకి మట్టి తోలకానికి అనుమతులివ్వండి



మాచర్ల రూరల్: పట్టణ శివారు జగనన్న కాలనీలో లబ్ధిదారులు గృహ నిర్మాణాల కోసం మట్టి తోలకాలకు అనుమతించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు హౌసింగ్ డీఈ ఆర్. బాలాజి నాయక్ వినతి పత్రం అందజేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీ అందించారు. తరచూ ఇటుక, కంకర, ఇసుక దొంగతనాలు జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రావెల్ మట్టి తోలకానికి ప్రత్యేక అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన ఏపీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు



విజయపురిసౌత్: ఇండో- నేపాల్ ఇంటర్నేషనల్ అథ్లెటిక్స్ పోటీలలో స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. జొన్నలగడ్డ నాగ రవీంద్ర(200 మీటర్లు రన్నింగ్), హరి కృష్ణ నాయక్(లాంగ్ జంప్), అంజి నాయక్ (100మీటర్స్ రన్నింగ్)లో ముగ్గురుకు బంగారు పథకాలు సాధించారు. నేపాల్‌లో ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో మెరిశారు.

గ్యాస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి: రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ మేనేజర్ షేక్ ఆసియా పర్వీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కర్లు మాట్లాడుతూ 16 సంవత్సరాల నుంచి రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ కంపెనీలో 18 మంది వర్కర్లు డెలివరీ బాయ్, ఆఫీస్ మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, గోడౌన్ ఇన్‌చార్జ్, వాచ్‌మన్, ఇలా వివిధ రకాల విధులు నిర్వహిస్తున్నారని, నేటికి కూడా పని భద్రత, ప్రభుత్వం ప్రకటించిన ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి సౌకర్యాలు లేవన్నారు. చట్టప్రకారం ఇవ్వవలసిన జీతాలు కూడా లేవని, పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో కుటుంబ జీవనం సతమతమవుతుందన్నారు. ఇప్పటికైనా స్పందించి రాజశ్రీ హెచ్‌పీ గ్యాస్ యాజమాన్యం ఎస్ ఫారం ఇచ్చి పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని, లేబర్ యాక్ట్ ప్రకారం సెలవులు ప్రకటించాలని, ప్రభుత్వం ఇస్తున్న ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.వీరాంజనేయులు, కార్యదర్శి అంజిబాబు, పీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎన్.పోతురాజు, సాంబయ్య, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంబాల ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు శ్రీహరి



పెదకూరపాడు: విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఇష్టపడి చదవాలని ఉత్తర అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు మందడి శ్రీహరి అన్నారు. పెదకూరపాడు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని గారపాడు, 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మోరల్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యపై ఆసక్తి చూపుతూ మంచి విజ్ఞానాన్ని పొందాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది శ్రీహరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గారపాడు, 75 త్యాళ్లూరు ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం పాలకేంద్రం వద్ద సోమవారం నరసరావుపేట ఎంవీ రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎంవీ రెడ్డి పాల్గొని 55 మందికి కంటి పరీక్షలు చేశారు. 22 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కంటిలోపాలున్న వారికి కళ్ళజోళ్ళు సిఫార్సు చేశారు. త్వరలో వీరికి సబ్సిడీపై కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. వైద్యసేవ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గుర్రం నాగపూర్ణంచంద్రరావు, పూనాటి కోటేశ్వరరావు, గుర్రం రామారావు, పీఆర్వో దిలీప్ ఉన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఆగస్టు 7న చలో విజయవాడ
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్
- వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: కాంట్రాక్ట్ విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఆగస్టు 7వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జె.రాజశేఖర్ కోరారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో సోమవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 పీఆర్‌సీ ఏరియాస్ ఇవ్వాలని, జీతాలు వ్యత్యాసం లేకుండా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమావన వేతనం అమలు చేయాలని కోరారు. బేసిక్ వేతనం రూ.46,000 ఇవ్వాలని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోటి రూపాయలు ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, బిల్ కలెక్టర్లకు, స్టోర్ హమాలీలు, కంప్యూటర్ ఆపరేటర్లకు టెక్నికల్ అసిస్టెంట్లకు హైస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరుతూ చలో విజయవాడ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రసాదరావు, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, కార్మికులు రామకృష్ణ, భిక్షాలు, రామారావు, బాబు పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

మాచవరం: మండలంలోని కొత్తగణేశునిపాడు రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివ కుమారి మాట్లాడుతూ... రైతులకు వివిధ పంటల్లో మేలైన సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే జిల్లా వనరుల కేంద్రం ఏఓ అరుణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. మండల ఏఓ కె.రామమ్మ మాట్లాడుతూ... ఈ క్రాప్ ఇన్సురెన్స్ పత్తి పంటకు జూలై 31వ తేదీ వరకు, కంది, మిర్చి, వరి పంటలకు ఆగస్టు 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. సీఎస్‌సీ సెంటర్‌లో ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకంలో చేరాలని కోరారు. అలాగే కౌలు రైతులు తప్పనిసరిగా సీసీఆర్‌సీ కార్డులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని కానీ, గ్రామ రెవెన్యూ అధికారి గాని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి ఎస్. అంబరావు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని పాత మాచర్లలోని వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గోదాదేవి అమ్మవారి విగ్రహానికి అర్చకులు రాఘవాచార్యులు, అధ్యక్షులు భవనాశి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి పూలు, పండ్లు, స్వీట్లుతో పూజా కార్యక్రమాలు చేశారు. మహిళా భక్తులు పలు గీతాలు ఆలపించారు. అర్చకులు అమ్మవారి చరిత్రను భక్తులకు వివరించారు. పూజా కార్యక్రమం, అభిషేకాలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సెక్రెటరీ సన్నిధి హనుమంతరావు, సత్యనారాయణ, రంగా జనార్ధనరావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి, మేడా వెంకటలక్ష్మి, పరిటాల ధనలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైన తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి



పిడుగురాళ్ల: ఫ్లోర్ బాల్ పోటీలకు పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన ఆర్.పెహలాద్ సాయి ఎంపికైనట్లు స్కూల్ డైరెక్టర్ బొల్లా గిరిబాబు తెలిపారు. వినుకొండ పట్టణంలోని లయోలా పాఠశాలలో నిర్వహించిన అండర్ -14, అండర్ -19 విభాగంలో ఫ్లోర్ బాల్ క్రీడలు నిర్వహించగా అందులో ఆర్.పెహలాద్‌సాయి అండర్- 14 విభాగంలో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 3వ తేదీన నరసరావుపేటలోని కే రీజ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సాయిని డైరెక్టర్ గిరిబాబు, ప్రిన్సిపాల్ పి.నరేష్ అభినందించారు.

రైస్ మిల్లులో చోరీ

నకరికల్లు: స్థానిక శ్రీనివాస రైస్ మిల్లులో రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు ఎస్ఐ చల్లా సురేష్ సోమవారం తెలిపారు. నకరికల్లుకు చెందిన కాళంగి జ్వాలా నర్సింహారావు స్థానిక అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే రైస్ మిల్లును నిర్వహిస్తున్నాడు. జూలకంటి వెంకటేశ్వర్లు గుమాస్తాగా, యక్కల జ్వాలా నర్సింహారావు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి మిల్లులో కార్యకలాపాలు ముగించుకొని బీరువా తాళాలు టేబుల్ డెస్క్‌లో పెట్టి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం మిల్లుకు వచ్చి చూడగా మిల్లు వెనుక భాగంలోని తలుపు బోల్టులు తొలగించి గుర్తు తెలియని దుండగులు మిల్లులోకి ప్రవేశించి బీరువాలోని రూ.15 వేలు నగదు అపహరించారని తెలిపారు. నిర్వాహకుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలియజేశారు.